మనసులో మాట
KANCHARLA
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
శుక్రవారం 17 ఏప్రిల్ 2026


# ఫిరాయింపులపై హైకోర్టు కీలక ఆదేశాలు

- స్పీకర్‌తో సహా 9 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు
- వివరణ ఇవ్వాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశం
- తదుపరి విచారణ మే 6కు వాయిదా



06

# తెలంగాణకు అవమానం

- పాక్ విభజనతో పోల్చడం దుర్మార్గం
- బీజేపీ ఎంపీ బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- మాజీ మంత్రి హరీష్ రావు



02

# అహంకారపూరితం

- తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ విషం
- ఎవరి భిక్షా కాదు.. పోరాట ఫలితం
- బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల మౌనం సిగ్గుచేటు
- వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 2లో..



# తేజస్వి సభ్యత్వాన్ని రద్దు చేయాలి



02

*పార్లమెంట్ రికార్డుల నుంచి ఆ వ్యాఖ్యలు తొలగించాలి*

*తెలంగాణ బీజేపీ ఎంపీల మౌనంపై పొన్నం ప్రభాకర్ ప్రశ్నలు*

# ఆ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలి




03

- అహింసా మార్గంలో సాగిన ఉద్యమాన్ని అవమానించవద్దు
- తేజస్వి సూర్య వ్యాఖ్యలు దుర్మార్గం
- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర

# భూతద్దంలో చూడొద్దు

- అనవసర రాద్ధాంతం చేస్తున్న విపక్షాలు
- బీఆర్ఎస్ నేతలకు బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు చురకలు



04

# పెట్టుబడులు పెట్టండి

## ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో దేశంలోనే అగ్రగామి తెలంగాణ



- ప్రపంచవ్యాప్తంగా 'మేడిన్ తెలంగాణ' మార్కు
- అమెరికా ప్రతినిధుల బృందానికి మంత్రి శ్రీధర్ బాబు పిలుపు

“ తెలంగాణను ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. అమెరికాకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందంతో సమావేశమైన ఆయన.. రాష్ట్రంలో ఉన్న అపారమైన పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డ్రోన్ల తయారీ వంటి రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా ఉందని.. అమెరికా పెట్టుబడిదారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ”

వివరాలు 2లో..

# త్యాగాల చరిత్రను అవమానిస్తే ఊరుకోం

- మహిళా బిల్లుపై కేంద్రానిది పెద్ద కుట్ర
- తేజస్వి వ్యాఖ్యలు అహంకారపూరితం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



05

# తెలంగాణకు అవమానం

## మాజీ మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్ – పాకిస్థాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా మండిపడ్డారు. పార్లమెంట్ వేదికగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల పోరాటం, వేలాది మంది యువతీ యువకుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణను రక్తపాతంతో కూడిన దేశ విభజనతో పోల్చడం అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ బీఆర్ఎస్ ఎంపీలు ప్రస్తుతం సభలో ఉండి ఉంటే తేజస్వి సూర్య సంగతి తేల్చి చెప్పేవారని హరీష్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ పూర్తిగా రాజ్యాంగబద్ధంగా జరిగిందని గుర్తు చేశారు. నేడు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న ఈ రాష్ట్రాన్ని చూసి బీజేపీ ఓర్వలేకపోతోందని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటు భారత్ – పాక్ విభజన వంటిదే అయితే, నాడు పార్లమెంటులో బీజేపీ ఈ బిల్లుకు ఎందుకు మద్దతు ఇచ్చిందని ప్రశ్నించారు.



### రాష్ట్ర ఎంపీల మౌనం సిగ్గుచేటు

గతంలో ప్రధాని మోదీ కూడా తెలంగాణ ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు తేజస్వి సూర్య కూడా అదే బాటలో నడుస్తూ విషం చిమ్ముతున్నారని హరీష్ రావు ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల మౌనాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి ఢిల్లీ పెద్దల ముందు రాష్ట్ర గౌరవాన్ని తాకట్టు పెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి చేసే శక్తులను ఇక్కడి ప్రజలు ఎన్నటికీ క్షమించరని, త్యాగాల చరిత్రను అగౌరవపరిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.ల

# తేజస్వి సభ్యత్వాన్ని రద్దు చేయాలి

## తెలంగాణ బీజేపీ ఎంపీల మౌనంపై పొన్నం ప్రభాకర్ ప్రశ్నలు

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా మండిపడ్డారు. తేజస్వి వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించేలా ఉన్నాయని.. వాటిని వెంటనే లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అసంబద్ధంగా మాట్లాడిన తేజస్వి సూర్య ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. తెలంగాణ డీఎన్‌ఏ ఉన్న ప్రతి ఒక్కరూ తేజస్వి వ్యాఖ్యలను ఖండించాల్సిన అవసరం ఉందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాష్ట్ర అస్తిత్వాన్ని కించపరుస్తున్నా తెలంగాణ బీజేపీ ఎంపీలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తేజస్వి సూర్య ఒక తెలివి లేని వ్యక్తిలా మాట్లాడుతున్నారని విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఏర్పాటుపై ఇంతటి అజ్ఞానంతో మాట్లాడటం శోచనీయమన్నారు. రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన రాష్ట్రాన్ని అవమానించడం అంటే రాజ్యాంగాన్నే కించపరచడమని పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. ఎంతో మంది త్యాగాలు.. దశాబ్దాల పోరాటం ద్వారా సాధించుకున్న తెలంగాణను అవమానించే హక్కు ఎవరికీ లేదని హితవు పలికారు. ప్రజల ఆకాంక్షలను తృణీకరిస్తూ మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



# తేజస్వి వ్యాఖ్యలు అహంకారపూరితం

- తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ విషం
- ఎవరి భిక్షా కాదు.. పోరాట ఫలితం
- బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల మౌనం సిగ్గుచేటు
- వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (మనసులో మాట):** పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై భారతీయ జనతా పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్ – పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమన్నారు. ఇలాంటి అహంకారపూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నుంచి ఎంపీ తేజస్వి సూర్య వరకు ప్రతి ఒక్కరూ తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు.

### బీజేపీ కుసంస్కారం బయటపడింది

ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా.. అక్కడే ఉన్న ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం సిగ్గుచేటని దుయ్యబట్టారు. తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సైతం తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించకుండా మౌనం వహించడం దారుణమని అన్నారు.

### బేషరతుగా క్షమాపణ చెప్పాలి

తమ కళ్ల ముందే రాష్ట్రాన్ని అవమానిస్తుంటే అడ్డుకోలేకపోయిన వీరు ప్రజలకు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందని హెచ్చరించారు. తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, రాష్ట్ర ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ కూడా ఈ విషయంలో క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో తేజస్వి సూర్య వ్యాఖ్యలే ఆ పార్టీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

- ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో దేశంలోనే అగ్రగామి
- ప్రపంచవ్యాప్తంగా 'మేడిన్ తెలంగాణ' మార్కు
- అమెరికా ప్రతినిధుల బృందానికి మంత్రి శ్రీధర్ బాబు పిలుపు



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (మనసులో మాట):** తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని అమెరికా పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆహ్వానించారు. డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో రాష్ట్రంలో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. గురువారం అమెరికాకు చెందిన 'నేషనల్ వార్ కాలేజీ' ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందంతో మంత్రి సమావేశమయ్యారు.

### నైపుణ్యం గల యువత.. వేగవంతమైన అనుమతులు

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా పరిశ్రమలకు అవసరమైన 'రెడీ టూ స్కిల్' వర్క్ ఫోర్స్‌ను అందిస్తున్నామని మంత్రి తెలిపారు. టీజీ ఐపాస్ విధానం ద్వారా కేవలం 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని రకాల అనుమతులు లభించేలా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోందని వివరించారు. టెక్నాలజీ, రీసెర్చ్, మ్యాన్యుఫ్యాక్చరింగ్ విభాగాల్లో అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

### ప్రపంచ దిగ్గజాలకు కేరాఫ్ అడ్రస్

ఏరోస్పేస్ రంగంలో తెలంగాణ ఏటా 30 శాతం వృద్ధి రేటును నమోదు చేస్తోంది. ఎగుమతుల్లో 103 శాతం సీఏజీఆర్ తో దూసుకెళ్తోంది. లాక్ హీడ్ మార్టిన్, బోయింగ్, సఫ్రాన్, ఎయిర్ బస్, డస్సాల్ట్ ఏవియేషన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ఇక్కడ విస్తరించాయని మంత్రి వెల్లడించారు. 1,500లకు పైగా ఎంఎస్ఎంఈలతో తెలంగాణ ఒక గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగిందని చెప్పారు. రాకెట్ల తయారీ నుంచి ఉపగ్రహాల వరకు ప్రతి దానిపై 'మేడిన్ తెలంగాణ' ముద్ర కనిపిస్తోందని గర్వంగా తెలిపారు.

### హైదరాబాద్ అత్యుత్తమ నగరం

ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును గెలుచుకోవడం మన రాష్ట్ర సాధించిన గొప్ప విజయమని కొనియాడారు. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో పటిష్టమైన ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

### అమెరికా ప్రతినిధుల ప్రశంసలు

తెలంగాణ వంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ మినిస్టర్ కౌన్సిలర్ పాల్ నరైన్ తెలిపారు. రాబోయే రోజుల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంపొందించుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అమెరికా రక్షణ, నావికాదళం, ఆర్మీకి చెందిన ఉన్నతాధికారులు కెప్టెన్ ఫ్రాంక్ ఒకటా, రెనో బామ్‌ఫోర్డ్, లెఫ్టినెంట్ కల్నల్ జాన్ కయాంగ్‌యాంగ్, రెబెక్కా కింగ్, లెఫ్టినెంట్ కల్నల్ మైఖేల్ కుబ్, జోస్ సలాస్ పాల్గొన్నారు. టీజీఐఐసీ ఎండీ శశాంక్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఏరోస్పేస్ డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# పాకిస్థాన్ విభజనతో పోల్చడం దుర్మార్గం

- పార్లమెంట్ ఆమోదంతోనే తెలంగాణ ఏర్పాటు
- తేజస్వి సూర్యవి అజ్ఞానపు మాటలు
- బీజేపీ బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (మనసులో మాట):** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఏర్పాటును భారత్ – పాకిస్థాన్ విభజనతో పోల్చడం దుర్మార్గమని విమర్శించారు. భారత రాజ్యాంగానికి లోబడి, పార్లమెంట్ ఆమోదంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అమరవీరుల త్యాగాలు, ప్రజల ఆకాంక్షల ఫలితమని స్పష్టం చేశారు. దశాబ్దాల పోరాటం ఫలితంగా తెలంగాణ సాకారమైందని మాజీ మంత్రి పేర్కొన్నారు.

## అవగాహన లేని వ్యాఖ్యలు

మిడిమిడి జ్ఞానం, అవగాహన లోపంతో బీజేపీ ఎంపీలు తెలంగాణ ఏర్పాటు మీద అవాకులు చవాకులు పేలుతున్నారని నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా తెలంగాణ ఏర్పాటు ప్రక్రియపై బీజేపీ దాడి చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఓట్లతో ఎంపీలుగా ఎన్నికైన ఎనిమిది మంది బీజేపీ, ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించాలని కోరారు. పార్లమెంట్‌లో తెలంగాణ విభజన విషయంలో చేసిన వ్యాఖ్యలకు బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యతో పాటు బీజేపీ పార్టీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి

మరోవైపు తెలంగాణపై తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ కూడా ఖండించింది. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగానికి అవమానం జరిగిందని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ అన్నారు. తెలంగాణ ఎంపీలకు పౌరుషం ఉందా అని ప్రశ్నిస్తూ, రాష్ట్రాన్ని అవమానిస్తుంటే ఢిల్లీలో ఊడిగం చేస్తున్నారా అని మండిపడ్డారు. ఢిల్లీలో డప్పు కొట్టే ఎంపీలకు తెలంగాణ ఆత్మగౌరవం పట్టదా అని నిలదీశారు. తేజస్వి సూర్య అజ్ఞాన సూర్యుడని, బలిదానాల చరిత్ర కలిగిన తెలంగాణ గురించి తెలుసుకోవాలని హితవు పలికారు.

# ఆ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలి

## రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య దేశ విభజనతో పోల్చడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రజలు అహింసా మార్గంలో పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నారని.. ఈ విషయం ప్రపంచం మొత్తానికి తెలుసని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలను మరిచిపోయి రాష్ట్రాన్ని దేశ విభజనతో పోల్చడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. దేశ అత్యున్నత చట్టసభలో కనీస అవగాహన లేకుండా మాట్లాడటం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని వద్దిరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరవీరుల త్యాగాలను కించపరిచేలా మాట్లాడిన తేజస్వి సూర్య తన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి అవాకులు చవాకులు పేలడం సరికాదని హితవు పలికారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఈ విషయాన్ని ఎందుకు ఖండించడం లేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఢిల్లీ వేదికగా మన రాష్ట్రాన్ని అవమానిస్తుంటే మౌనంగా ఉండటం సరికాదన్నారు. ఇప్పటికైనా ఇతర పార్టీల ఎంపీలు స్పందించి రాష్ట్ర గౌరవాన్ని కాపాడాలని వద్దిరాజు రవిచంద్ర కోరారు.

# గ్లోబల్ స్టార్స్‌గా తెలంగాణ ప్లేయర్లు

## విజేతలకు కేటీఆర్ బహుమతుల ప్రదానం

## వచ్చే ఏటా రాష్ట్రవ్యాప్త క్రికెట్ పోటీలు



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (మనసులో మాట):** తెలంగాణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన క్రికెట్ కప్ 8వ ఎడిషన్ పోటీల విజేతలకు నందినగర్ నివాసంలో ఆయన బహుమతులు అందజేశారు. రాష్ట్రంలో సమగ్ర క్రీడా పాలసీ తీసుకురావాల్సిన అవసరం ఉందని, భవిష్యత్తులో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ పోటీలు

దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నీ స్ఫూర్తితో వచ్చే ఏడాది నుంచి రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని కేటీఆర్ ప్రకటించారు. క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కాకతీయ క్రికెట్ అకాడమీ సభ్యులను అభినందించారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. గత ఎనిమిదేళ్లుగా పేద క్రీడాకారులకు ఈ టోర్నీ ద్వారా చేయూతనిస్తున్నామని తెలిపారు.

## విజేతలకు ట్రోఫీల ప్రదానం

టోర్నీలో విన్నర్ గా నిలిచిన 51వ డివిజన్ జట్టుకు, రన్నర్స్ గా నిలిచిన 49వ డివిజన్ జట్టుకు కేటీఆర్ నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. డిపార్ట్‌మెంట్ క్రికెట్ విభాగంలో అంజలి కిడ్నీ కేర్ సెంటర్ జట్టు విజేతగా, సంకీర్తన హాస్పిటల్ జట్టు రన్నరప్ గా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బోయినపల్లి రంజిత్ రావు, బొంగు అశోక్ యాదవ్, అకాడమీ ప్రతినిధులు ఫారుక్ అలీ, మాజీద్, వీరు, సిరాజ్, రాజేష్, రాంబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు ప్రజల చెంతకే..

## వార్డుల అభివృద్ధికి 30 కోట్లు కేటాయింపు

## ఎమ్మెల్యే పాయల శంకర్

**ఆదిలాబాద్, ఏప్రిల్ 16 (మనసులో మాట):** ప్రభుత్వం ఏదైనా సరే అంతిమంగా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. 'ప్రజా పాలన ఉ ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గురువారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన మున్సిపల్ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధికారులు ముందుగా మున్సిపల్, వైద్య, పోలీస్ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలకు రుణాల చెక్కులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్లను అతిథులు పంపిణీ చేశారు. గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించడంతో పాటు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. అధికారులు ప్రజల వద్దకే వచ్చి సమస్యలను పరిష్కరించాలని, దరఖాస్తులపై తీసుకున్న చర్యలను లేఖల ద్వారా తెలియజేయాలని సూచించారు.

## ఆర్థికాభివృద్ధి సాధించాలి

మున్సిపల్ ఛైర్ పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా 99 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామని చెప్పారు. లబ్ధిదారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, ఎల్డీఎం ఉత్పల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజు, డీఎంహెచ్ఓ రాథోడ్ నరేందర్, డీడబ్ల్యూఓ శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్సై దేవేందర్, తహసీల్దార్ శ్రీనివాస్ తో పాటు కౌన్సిలర్లు, అంగన్‌వాడీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# చెల్పూరు కేటీపీపీలో అగ్నిప్రమాదం

## బొగ్గు నిల్వల్లో ఎగసిపడిన మంటలు

## అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది

## విద్యుత్ ఉత్పత్తికి తప్పిన ఆటంకం



**జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 15 (మనసులో మాట):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూరు కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీపీపీ)లో గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాంట్ ఆవరణలో నిల్వ ఉంచిన రిజెక్టెడ్ బొగ్గు కుప్పల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో బొగ్గు నిల్వల్లో ఉష్ణోగ్రత పెరిగి స్వయంచాలితంగా మంటలు అంటుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనతో భారీగా వెలువడిన నల్లటి పొగ కిలోమీటర్ల మేర వ్యాపించడంతో పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఆందోళన చెందారు. సమాచారం అందుకున్న వెంటనే ఎల్-అండ్-టీ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. బొగ్గు నిల్వల వద్ద మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక యంత్రాలను రంగంలోకి దించారు. అగ్నిప్రమాదం జరిగినప్పటికీ విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం కలగలేదని అధికారులు స్పష్టం చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యగా ప్లాంట్ లోని ఇతర విభాగాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అగ్నిప్రమాదం వల్ల జరిగిన నష్టంపై అధికారులు విచారణ చేపట్టారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని వెల్లడించారు.

# ఏసీబీ వలలో విద్యుత్ ఏడీఈ

**30 వేల లంచం తీసుకుంటూ పట్టివేత**

**బిల్లుల క్లియరెన్స్ కోసం డిమాండ్**



**నల్లగొండ, ఏప్రిల్ 15 (మనసులో మాట):** రాష్ట్రంలో అవినీతి అధికారుల వేట కొనసాగుతోంది. తాజాగా నల్లగొండ జిల్లా దేవరకొండ ఏడీఈ సిరికొండ సైదులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయారు. బాధితుడి నుంచి 30 వేల రూపాయలు తీసుకుంటుండగా అధికారులు గురువారం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. గతేడాది కంబాలపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ పై పిడుగు పడటంతో భారీగా నష్టం వాటిల్లింది. దీనికి సంబంధించి మరమ్మతులు పూర్తి చేసిన బాధితుడు 10 లక్షల రూపాయల బిల్లుల కోసం ఏడీఈని సంప్రదించారు. అయితే ఆ బిల్లులను మంజూరు చేయడానికి సైదులు లంచం డిమాండ్ చేశారు. అధికారి వేధింపులు భరించలేక బాధితుడు నల్లగొండ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు నగదు అందజేస్తుండగా అధికారులు దాడి చేసి సైదులును పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. అవినీతికి పాల్పడే అధికారుల సమాచారాన్ని వెంటనే తమకు తెలియజేయాలని అధికారులు సూచించారు.

# వడదెబ్బతో కొడుకు మృతి.. తట్టుకోలేక తల్లి కన్నుమూత

**తూముకుంట గ్రామంలో మిన్నంటిన రోదనలు**

**మల్లికార్జున్, రంగమ్మ మృతితో విషాదం**

**జోగులాంబ గద్వాల, ఏప్రిల్ 15 (మనసులో మాట):** జోగులాంబ గద్వాల జిల్లాలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. అప్పటివరకు కళ్లముందే తిరిగిన కొడుకు వడదెబ్బతో ప్రాణాలు కోల్పోగా.. ఆ వార్త విన్న తల్లి గుండె తట్టుకోలేకపోయింది. కొడుకు మరణించిన కొద్ది గంటల వ్యవధిలోనే తల్లి కూడా మృతి చెందింది. ఈ సంఘటన ఐజ మండలం తూముకుంట గ్రామాన్ని తీవ్ర విషాదంలో ముంచేసింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కురువ మల్లికార్జున్ తీవ్రమైన ఎండల ప్రభావంతో వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయాడు. కంటిపాపలా పెంచుకున్న కొడుకు ఇక లేడన్న వార్త విన్న తల్లి కురువ రంగమ్మ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు మరణాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయింది. పుట్టెడు దుఃఖంతో కొద్దిసేపటికే ఆమె గుండె ఆగిపోయింది. ఒకే ఇంట్లో తల్లికొడుకులు మృతి చెందడంతో తూముకుంట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేస్తోంది. మల్లికార్జున్, రంగమ్మ మృతి పట్ల గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. తల్లీకొడుకుల ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామస్థులు ప్రార్థిస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# డీలిమిటేషన్‌పై కుట్ర రాజకీయాలు

- ఉత్తరాది.. దక్షిణాది అంటూ విభజన రేఖలు
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు
- ఒకే దేశం ఒకే ఎన్నికతోనే సమస్యలకు పరిష్కారం



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (మనసులో మాట):** కాంగ్రెస్ పార్టీ మరోసారి దేశ విభజన కోసం కుట్రలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆరోపించారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ ప్రజల మధ్య విభజన రేఖలు గీయడం అత్యంత దారుణమని విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లదని స్పష్టం చేశారు. గతంలో మహిళా బిల్లును సమర్థించిన రాహుల్ గాంధీ, ఇప్పుడు ఎందుకు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

**విభజన రాజకీయాలు సరికావు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉత్తరాది, దక్షిణాది విభజన రాజకీయాలు చేస్తున్నారని రామచంద్రరావు మండిపడ్డారు. కేరళ కంటే తెలంగాణ జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ, అక్కడ 20 ఎంపీ సీట్లు ఉంటే ఇక్కడ కేవలం 17 మాత్రమే ఉన్నాయని గుర్తు చేశారు. ముఖ్యమంత్రికి అంత పట్టింపు ఉంటే మొదట కేరళలో సీట్లు తగ్గించాలని కోరాలని హితవు పలికారు. దక్షిణాదిలో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల సీట్లు తగ్గుతాయనేది తప్పుడు ప్రచారమని కొట్టిపారేశారు. రాష్ట్రాల స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) ప్రాతిపదికన సీట్లు పెంచాలని కోరడం సహేతుకం కాదని పేర్కొన్నారు.

**ఓట్ల కోసం అసత్య ప్రచారాలు**

లోక్‌సభలో గందరగోళం సృష్టించేందుకు కాంగ్రెస్ వ్యూహాలు పన్నుతోందని రామచంద్రరావు ఆరోపించారు. రాహుల్ గాంధీ కంటే రేవంత్ రెడ్డికి ఎక్కువ విషయాలు తెలుసా అని నిలదీశారు. తెలంగాణలో సీట్లు పెరిగితే ఉత్తరప్రదేశ్‌లో కూడా పెరుగుతాయని, ఇందులో ఎవరికీ అన్యాయం జరగదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సక్రమంగా జరగలేదని, తమ వీధిలో ఎవరి ఇంటికీ ఎన్యూమరేటర్లు రాలేదని విమర్శించారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ ఇలాంటి అసత్యాలను ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు.

**ఒకే దేశం ఒకే ఎన్నిక అవసరం**

దేశంలో నిరంతరం ఎక్కడో ఒక చోట ఎన్నికలు జరుగుతూనే ఉంటాయని, దీనివల్ల అభివృద్ధికి ఆటంకం కలుగుతోందని రామచంద్రరావు అభిప్రాయపడ్డారు. ఈ సమస్యలన్నింటికీ 'ఒకే దేశం ఒకే ఎన్నిక' విధానమే సరైన పరిష్కారమని స్పష్టం చేశారు. దక్షిణాదిలో కాంగ్రెస్ కంటే బీజేపీకే ఎక్కువ మంది ఎంపీలు ఉన్నారని గుర్తు చేశారు. ప్రజలు తెలివైన వారని, రేవంత్ రెడ్డి పన్నుతున్న రాజకీయ ఉచ్చులో పడబోరని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీ ప్రాంతీయ పార్టీల తరహాలో మాట్లాడటం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# భూతద్దంలో చూడొద్దు

**బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు**

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు తప్పుబట్టారు. కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్లు విపక్షాలు ప్రవర్తిస్తున్నాయని మండిపడ్డారు. తేజస్వి మాటల్లోని అంతరార్థం వేరని.. విపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని హితవు పలికారు. తేజస్వి ఎక్కడా తెలంగాణను పాకిస్థాన్‌తో పోల్చలేదని ఆయన స్పష్టం చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటులో బీజేపీ కీలక పాత్ర పోషించిందని రామచంద్రరావు గుర్తు చేశారు. నాడు జేఏసీలో భాగస్వామిగా ఉండి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లామని.. బీజేపీ మద్దతు లేకుంటే తెలంగాణ సాధ్యమయ్యేది కాదన్నారు. పార్లమెంటులో రాష్ట్ర ఏర్పాటుపై చర్చ జరుగుతున్నప్పుడు బీఆర్ఎస్ సభ్యులు అక్కడ లేరని విమర్శించారు. ఆ సమయంలో కాంగ్రెస్ తీసుకున్న యూ-టర్న్ వల్లే ఎంతో మంది యువకులు బలిదానాలు చేసుకున్నారని.. ఆ మరణాలకు కాంగ్రెస్ పార్టీయే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గతంలో అటల్ బిహారీ వాజపేయి హయాంలో ఒక్క రక్తపు చుక్క చిందకుండా ఎంతో ప్రశాంతంగా మూడు రాష్ట్రాలను ఏర్పాటు చేసిన చరిత్ర బీజేపీది అని రామచంద్రరావు పేర్కొన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని.. ఇలాంటి చౌకబారు రాజకీయాలు మానుకోవాలని సూచించారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి అంశాలను తెరపైకి తెస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల్లో ప్రజలు భాగస్వాములు కావాలి

**టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి**

**సంగారెడ్డి, ఏప్రిల్ 16 (మనసులో మాట):** కంది మండల రైతు వేదికలో గురువారం 'ప్రజాపాలనఉప్రగతి ప్రణాళిక' మండల స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర గీతాలాపనతో ప్రారంభమైన ఈ సభలో ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. రైతు రుణమాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాల అమలు తీరును అధికారులు వివరించారు. ముఖ్యమంత్రి అల్పాహారం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాలపై అవగాహన కల్పించారు.

**చివరి గడపకు సంక్షేమ ఫలాలు**

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. 99 రోజుల ప్రణాళిక ద్వారా ప్రభుత్వ ఫలాలు ప్రతి కుటుంబానికి చేరాలని ఆకాంక్షించారు. రైతులకు రైతు భరోసా, వ్యవసాయ యంత్రాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య కోసం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తున్నామని, వసతి గృహాల్లో పోషకాహారం అందిస్తున్నామని పేర్కొన్నారు.

**యాక్షన్ ప్లాన్ లక్ష్యాలు**



జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. మార్చి 6 నుంచి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే గ్రామ సభలు నిర్వహించామని, ఈ వారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో మూడు నెలల రేషన్ పంపిణీ 80 శాతం పూర్తయిందని వెల్లడించారు. రబీ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలను పెంచుతామని, ఉపాధి హామీ కింద చేపట్టిన భవనాల పనులను సర్పంచులు రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఐసీ జీఎం తుల్జా నాయక్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసిల్దార్ రవికుమార్, ఎంపీవో మహేందర్ రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

# తప్పుల తడకగా బీసీ గణన

- బీసీల జనాభాను తగ్గించి చూపిస్తున్నారు
- కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** తెలంగాణలో నిర్వహించిన కుల గణన గణాంకాలు పూర్తిగా తప్పుల తడకగా ఉన్నాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. బీసీల అసలు జనాభాను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తగ్గించి చూపిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 61 శాతం వరకు ఉన్న బీసీ జనాభాను తక్కువగా చూపుతూ వాస్తవాలను వక్రీకరించారని ఆయన మండిపడ్డారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



### అమలుకు నోచుకోని హామీలు

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్‌ను ఇప్పటివరకు అమలు చేయలేదని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. కులాల వారీగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. బీసీలకు తగిన రిజర్వేషన్లు, నామినేటెడ్ పదవులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా కేవలం పదవులు ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు.

### వాస్తవ రూపం దాల్చని గణాంకాలు

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణనలో బీసీ కుటుంబాల వివరాలు సరిగ్గా సేకరించలేదని.. అదే బాటలో రాష్ట్ర ప్రభుత్వం కూడా వివరాలను బయటపెట్టిందని ఆరోపించారు. ఈ గణాంకాలు క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించడం లేదని స్పష్టం చేశారు. బీసీలకు న్యాయం జరగాలంటే ముందుగా కామారెడ్డి డిక్లరేషన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరగాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై బీసీలకు అన్యాయం చేస్తున్నాయని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. చట్టసభల్లో బీసీలకు తగిన రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని.. వారు చట్టసభల్లోకి వెళ్ళినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. 56 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభాకు తగిన సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు అమలు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# త్యాగాల చరిత్రను అవమానిస్తే ఊరుకోం

### మహిళా బిల్లుపై కేంద్రానిది పెద్ద కుట్ర

### తెలంగాణపై తేజస్వి వ్యాఖ్యలు అహంకారపూరితం

### జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (మనసులో మాట):** తెలంగాణ ఉద్యమాన్ని భారత్ – పాకిస్థాన్ విభజనతో పోల్చడంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్రంగా మండిపడ్డారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యకు తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల ఆకాంక్ష అంటే అంత చులకనా అని నిప్పులు చెరిగారు. ఎంతో మంది త్యాగాల పునాదులపై సాగిన ఉద్యమాన్ని కించపరచడం అజ్ఞానానికి పరాకాష్ట అని విమర్శించారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదని, తెలంగాణ అస్తిత్వంపై జరిగిన దాడి అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అవమానిస్తుంటే తెలంగాణ బీజేపీ ఎంపీలు ఎందుకు నోరు మెదపడం లేదని, వారికి ఆత్మగౌరవం ఉంటే వెంటనే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

### రిజర్వేషన్లపై కేంద్రం కుట్ర

మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్ తో ముడిపెట్టడం కేంద్ర ప్రభుత్వ పెద్ద కుట్ర అని కవిత ఆరోపించారు. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి డీలిమిటేషన్ ద్వారా దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. డీలిమిటేషన్ పేరుతో తెలంగాణ సీట్ల సంఖ్యను తగ్గిస్తే చూస్తూ ఊరుకోమని, రాష్ట్ర ప్రయోజనాల కోసం మరో ఉద్యమానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్లలో ఖచ్చితంగా బీసీ సబ్ కోటా ఉండాలని, అప్పుడే వెనుకబడిన వర్గాల మహిళలకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం దక్కుతుందని స్పష్టం చేశారు.

# డీలిమిటేషన్‌పై కేంద్రం కుట్ర రాజకీయాలు

### దక్షిణాదిని దెబ్బతీసేందుకు బీజేపీ ఎత్తుగడ

### పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ విమర్శలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (మనసులో మాట):** డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ విమర్శించారు. దక్షిణాదిలో బీజేపీకి బలం లేకపోవడంతోనే కొత్త ఎత్తుగడలు వేస్తోందని మండిపడ్డారు. ఉత్తరాదిలో ఓటు బ్యాంకును పెంచుకుని అక్కడ సీట్లు పెంచుకోవడం ద్వారా మళ్లీ అధికారంలోకి రావాలని ప్లాన్ చేస్తోందని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి భారీగా నిధులు వెళ్తున్నాయని.. కానీ డీలిమిటేషన్ వల్ల ఆ రాష్ట్రాలకే అన్యాయం జరుగుతోందని వంశీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణాదిలో బీజేపీపై పెరుగుతున్న వ్యతిరేకత దృష్ట్యా ఉత్తరాదిలో సీట్లు పెంచుకునేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని వంశీకృష్ణ పేర్కొన్నారు. డీలిమిటేషన్ ద్వారా అన్ని రాష్ట్రాలకు సమానంగా న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. బీజేపీ సొంత లాభం కోసం డీలిమిటేషన్‌ను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందని.. దీనిపై పార్లమెంట్ లో రాజ్యాంగబద్ధంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అన్ని ప్రాంతాలకు సమాన ప్రాతినిధ్యం దక్కినప్పుడే ప్రజాస్వామ్యానికి అర్థం ఉంటుందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.



# తెలంగాణ ఏర్పాటుపై తేజస్వీ వ్యాఖ్యలు అజ్ఞానానికి పరాకాష్ట

### అమరవీరుల త్యాగాలను అవమానించడమే

### వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి: మంత్రి జూపల్లి



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (మనసులో మాట):** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్–పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఈ వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని మండిపడ్డారు. బీజేపీ నేతలకు తెలంగాణ ఉనికి అన్నా, ఇక్కడి ప్రజల అభ్యున్నతి అన్నా మొదటి నుంచి కడుపుమంట అని ధ్వజమెత్తారు.

### సుదీర్ఘ పోరాట ఫలితం

తెలంగాణ ఆవిర్భావం వందలాది మంది యువకుల బలిదానాలు, దశాబ్దాల సుదీర్ఘ పోరాట ఫలితమని జూపల్లి గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధంగా పార్లమెంట్ ఆమోదించిన ప్రక్రియను దేశ విభజనతో పోల్చడం ఎంపీ అజ్ఞానానికి పరాకాష్ట అని విమర్శించారు. గతంలో ప్రధాని మోదీ కూడా అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆ విద్వేష భావజాలమే ఇప్పుడు తేజస్వీ సూర్య మాటల్లో ప్రతిబింబిస్తోందని దుయ్యబట్టారు. సోనియా గాంధీ ఒక తల్లి మనసుతో తెలంగాణ బిడ్డల ఆవేదనను అర్థం చేసుకుని ధైర్యంగా రాష్ట్రం ఇచ్చారని ప్రశంసించారు.

### విద్వేషం మానుకోవాలి

చిన్న రాష్ట్రమైన తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేకనే బీజేపీ నేతలు ఇలాంటి వివాదాలకు తెరలేపుతున్నారని జూపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల కోసం ఇక్కడి ప్రజలను వాడుకుంటూ మనసులో మాత్రం విద్వేషాన్ని నింపుకున్నారని విరుచుకుపడ్డారు. తేజస్వీ సూర్య తెలంగాణ ప్రజలకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అస్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడితే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని మంత్రి హెచ్చరించారు.

# శాసన మండలి పనులను త్వరగా పూర్తి చేయాలి

### చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆదేశం

### త్వరలో అసెంబ్లీ, మండలి మధ్య సెంట్రల్ హాల్



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (మనసులో మాట):** తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తన ఛాంబర్‌లో ఆర్&బీ శాఖ, అఘాఖాన్ సంస్థ, శాసనసభ అధికారులతో గురువారం సమావేశమయ్యారు. మండలిలో పెండింగ్‌లో ఉన్న అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు శాసనసభ, మండలి భవనాల మధ్య సెంట్రల్ హాల్ నిర్మాణ పనులను వెంటనే మొదలుపెట్టాలని సూచించారు.

### సభ్యుల సౌకర్యార్థం సెంట్రల్ హాల్

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సౌకర్యవంతంగా ఉండేలా సెంట్రల్ హాల్‌ను డిజైన్ చేయాలని అధికారులకు సుఖేందర్ రెడ్డి సూచించారు. పనుల ప్రారంభంలో జాప్యం లేకుండా వేగంగా అడుగులు వేయాలన్నారు. ఈ సమావేశంలో శాసన మండలి సెక్రెటరీ డాక్టర్ నరసింహాచార్యులు, చైర్మన్ ఓఎస్డీ గోవర్ధన్ రెడ్డి, పీఎస్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫిరాయింపులపై హైకోర్టు కీలక ఆదేశాలు

- స్పీకర్‌తో సహా 9 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు
- వివరణ ఇవ్వాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశం
- తదుపరి విచారణ మే 6కు వాయిదా



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనసులో మాట):** తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటు వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 9 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారలేదని స్పీకర్ ప్రకటించిన 9 మంది ఎమ్మెల్యేలతో పాటు స్వయంగా స్పీకర్ కూడా ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. వీరంతా తమ వాదనలతో కూడిన కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది.

## నోటీసులు అందుకున్న ఎమ్మెల్యేలు వీరే

హైకోర్టు నోటీసులు జారీ చేసిన వారిలో దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాష్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి (సంజయ్), తెల్లం వెంకట్రావు ఉన్నారు. గతంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఈ ఎమ్మెల్యేలు సాంకేతికంగా పార్టీ మారలేదని, వారు ఇంకా బీఆర్ఎస్ లోనే కొనసాగుతున్నారనే అర్థం వచ్చేలా స్పీకర్ తీర్పునిచ్చారు. అయితే వారు బహిరంగంగానే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు.

## మే 6కు విచారణ వాయిదా

స్పీకర్ నిర్ణయం ఏకపక్షంగా ఉందన్నది పిటిషనర్ల ప్రధాన వాదన. ఈ కేసులో లోతైన విచారణ అవసరమని భావించిన హైకోర్టు తదుపరి విచారణను మే 6వ తేదీకి వాయిదా వేసింది. ఈలోగా ప్రతివాదులందరూ తమ కౌంటర్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న ఈ కేసులో హైకోర్టు తీర్పు ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ కలిగిస్తోంది. ఒకవేళ కోర్టు అనర్హత వేటు విషయంలో కఠినంగా వ్యవహరిస్తే రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉంటుందా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# అదనపు డీజీపీని కలిసిన వరంగల్ సీపీ

### 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో పాల్గొనేందుకు రాక

### హనుమకొండ లో మర్యాదపూర్వక భేటీ



**వరంగల్, ఏప్రిల్ 14 (మనసులో మాట):** వరంగల్ హనుమకొండ రోడ్డు రవాణా శాఖ, పోలీస్ కమిషనరేట్ సంయుక్తంగా గురువారం నిర్వహించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర సీఐడీ, ఏసీబీ, ఉమెన్ సేఫ్టీ అదనపు డీజీపీ చారు సిన్హా హనుమకొండకు చేరుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండలోని పోలీస్ గెస్ట్ హౌస్‌లో ఆమెను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అదనపు డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. అదనపు డీజీపీని కలిసిన వారిలో డీసీపీలు ధార కవిత, అంకిత్ కుమార్, ఏఎస్పీ శుభం, ట్రైనీ ఐపీఎస్ మనీషా నెహ్రా ఉన్నారు. వీరితో పాటు సీఐడీ అదనపు ఎస్పీ జితేందర్, ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇతర విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు చారు సిన్హాను కలిసి మర్యాదపూర్వకంగా చర్చించారు. ఈ పర్యటనలో భాగంగా నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లపై సీపీతో కలిసి ఆమె సమీక్షించారు.

# ట్రాఫిక్ పార్కును పరిశీలించిన కలెక్టర్

### పిల్లల్లో నిబంధనలపై అవగాహనే లక్ష్యం

### ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో పార్కు నిర్మాణం



**హనుమకొండ, ఏప్రిల్ 16 (మనసులో మాట):** హనుమకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కును జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం పరిశీలించారు. పాఠశాల విద్యార్థులకు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించేలా ఈ పార్కును తీర్చిదిద్దారు. పార్కులోని వివిధ విభాగాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

## సిగ్నల్స్, ఫ్లైఓవర్ల పరిశీలన

ఈ అవేర్‌నెస్ పార్కులో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ కూడళ్లు, సిగ్నల్స్, యూటర్న్ లు, ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. ముఖ్యంగా పాఠశాలల వద్ద ఉండాల్సిన ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏ విధంగా నిర్మించారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ సురేష్ రెడ్డి పార్కు విశేషాలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ పర్యటనలో రవాణా శాఖ అధికారులు వేణుగోపాల్, రమేష్ రాథోడ్, కిషోర్ బాబుతో పాటు హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

# తాండూరు అభివృద్ధికి 500 కోట్ల ప్రతిపాదనలు



**తాండూరు, ఏప్రిల్ 16 (మనసులో మాట):** తాండూరు మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం గురువారం చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలో సమగ్రమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి 480 కోట్ల రూపాయల ప్రాజెక్టుకు కౌన్సిల్ పరిపాలన ఆమోదం తెలిపింది. మంచినీటి సరఫరాను మెరుగుపరిచేందుకు కాగ్నా నది వద్ద 26 కోట్లతో చేపట్టే పనుల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని తీర్మానించారు. ఎజెండాలోని 20 అంశాలతో పాటు టేబుల్ ఎజెండాలోని మరో రెండు అంశాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పట్టణంలో మురుగునీటి వ్యవస్థను ఆధునీకరించి 13 ఎంఎల్డీ సామర్థ్యం గల ఎస్టీపీ నిర్మించేందుకు భారీ కేటాయింపులు చేశారు. తాగునీటి ఎద్దడిని నివారించేందుకు పాత, కొత్త పంప్ హౌస్‌ల మరమ్మతులతో పాటు కొత్తగా 6 ఎంఎల్డీ సామర్థ్యం గల డబ్ల్యూటీపీ నిర్మించాలని నిర్ణయించారు. ప్రతి వార్డులో సీసీ డ్రైన్లు, కల్వర్టుల కోసం 5 లక్షల చొప్పున మొత్తం 1.80 కోట్లు కేటాయించారు. 36 వార్డుల్లో కొత్త బోర్లు, మోటార్ల కోసం 90 లక్షలు, వీధి జంతువుల సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు 17.50 లక్షలు, నీటి సరఫరా నిర్వహణకు 40 లక్షలు, వాహనాల మరమ్మతుల కోసం 15 లక్షలు వెచ్చించనున్నారు. పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్‌లో కీలక మార్పులు చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. పారిశ్రామిక, గ్రీన్, బఫర్ జోన్ ప్రాంతాలను రెసిడెన్షియల్ జోన్‌గా మారుస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని తీర్మానించారు. ఎమ్మెల్యే సూచన మేరకు పట్టణ ప్రణాళిక విభాగం ఈ మార్పులు చేయనుంది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మేనేజర్ నరేందర్ రెడ్డి, డీఈ మణిపాల్ తో పాటు టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# వక్ఫ్ భూముల సమస్యను పరిష్కరించండి

### మంత్రికి ఎమ్మెల్యే విన్నపం

**హైదరాబాద్, ఏప్రిల్ 16 :** మల్కాజ్‌గిరి నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని బ్రాహ్మణ సంఘానికి ఒక ఎకరం స్థలం కేటాయించినందుకు మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరిలోని పలు కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న వక్ఫ్ బోర్డు సమస్యల పరిష్కారం కోసం మంత్రి తో సమగ్రంగా చర్చించారు. తప్పుగా నమోదైన సర్వే నంబర్ల పై వక్ఫ్ బోర్డు చేసిన క్లెయిమ్స్ వల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే వివరించారు.

## 22-ఏ జాబితా నుంచి తొలగించాలి

సంబంధిత ఆస్తులు పూర్తిగా చట్టబద్ధంగా కొనుగోలు చేసినవని.. వీటికి సేల్ డీడ్లు, లింక్ డాక్యుమెంట్లు, పహాణి పత్రాలు వంటి ఆధారాలు ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ భూములు మల్కాజ్‌గిరి పరిధిలో కాకుండా ఇతర ప్రాంతాల పరిధిలోకి వస్తాయని హైకోర్టు కేసులు, కలెక్టర్ ఉత్తర్వులు స్పష్టంగా పేర్కొన్నాయని వివరించారు. అయినప్పటికీ వక్ఫ్ బోర్డు ఈ సర్వే నంబర్లను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సర్వే నంబర్లను నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే విన్నపంపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు సమస్యను సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వక్ఫ్ బోర్డు సీఈఓ మహమ్మద్ అసదుల్లా తో మాట్లాడి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మల్కాజ్‌గిరి ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు ఎమ్మెల్యే కట్టుబడి ఉన్నారని ఈ సమావేశం ద్వారా స్పష్టమైంది.





# ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి

- బస్ షెల్టర్ల ఏర్పాటుకు వినతి
- డిపో మేనేజర్‌కు తుంగతుర్తి రవి విజ్ఞప్తి
- వడదెబ్బల నుంచి రక్షణ కల్పించాలని కోరిక

**మేడ్చల్ జిల్లా, ఏప్రిల్ 16 (మనసులో మాట):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని తొమ్మిదవ డివిజన్ మేడిపల్లి, పదవ డివిజన్ పీర్జాదిగూడ ప్రాంతాల్లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆర్వీ ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి కోరారు. ఉప్పల్ డిపో మేనేజర్ శ్రీనివాస్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. వరంగల్ హైవేపై ఉన్న బస్టాపుల్లో షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన వివరించారు.

## ప్రయాణికుల సౌకర్యమే ముఖ్యం

వేసవి ఎండల దృష్ట్యా ప్రయాణికులు వడదెబ్బకు గురికాకుండా తక్షణమే షెల్టర్లు నిర్మించాలని రవి కోరారు. శిథిలావస్థకు చేరిన బస్టాపులను పునర్నిర్మించాలని, రద్దీ ఎక్కువగా ఉన్న చోట కొత్తవి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తాత్కాలికంగా ఆర్వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉప్పల్ డిపో బస్టాప్ వద్ద షెల్టర్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కవిడె కుమార్, సోమయ్య, నాగరాజు, శరత్ గౌడ్ తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణలో రైల్వే ప్రాజెక్టుల వేగవంతానికి సమిష్టి కృషి

## ఎస్‌సీఆర్, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల కీలక భేటీ

## హై స్పీడ్ రైల్ కారిడార్ ప్రతిపాదనలపై చర్చ

**హైదరాబాద్, ఏప్రిల్ 16 (మనసులో మాట):** తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్), రాష్ట్ర ప్రభుత్వ అధికారుల మధ్య కీలక సమన్వయ సమావేశం జరిగింది. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో గురువారం జరిగిన ఈ భేటీలో ఎస్‌సీఆర్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే లైన్లు, స్టేషన్ల అభివృద్ధి, రోడ్ ఓవర్ బ్రిడ్జిల (ఆర్‌ఓబీ) నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించారు.

### మౌలిక సదుపాయాలపై చర్చలు

రైల్వే అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రాష్ట్రంలో సాగుతున్న వివిధ ప్రాజెక్టుల స్థితిగతులను వివరించారు. కొత్త రైలు మార్గాల నిర్మాణం, స్టేషన్లకు అనుసంధాన మార్గాలు, రోడ్ అండర్ బ్రిడ్జిల (ఆర్ యూ బీ) మంజూరు ప్రక్రియపై చర్చించారు. ప్రాజెక్టుల అమలులో రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన భూసేకరణ, ట్రాఫిక్ మళ్లింపు, విద్యుత్ లైన్ల తరలింపు వంటి అంశాల్లో సహకారం అందించాలని రైల్వే అధికారులు కోరారు. ముఖ్యంగా భూసేకరణ, వ్యయ భాగస్వామ్యంపై రాష్ట్ర ప్రభుత్వ మద్దతును కోరారు.

### హై స్పీడ్ రైల్ కారిడార్ ప్రతిపాదన

హైదరాబాద్‌ను బెంగళూరు, చెన్నై, పుణే నగరాలతో కలిపే హై స్పీడ్ రైల్ కారిడార్ ప్రతిపాదనపై ఈ సమావేశంలో ప్రాథమిక చర్చలు జరిగాయి. వీటితో పాటు ప్రాంతీయ రింగ్ రైల్ ప్రాజెక్ట్ పురోగతిని కూడా అధికారులు సమీక్షించారు. కొనసాగుతున్న ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి లభించే మద్దతుతో పనుల వేగం పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### నిరంతర సమన్వయమే కీలకం

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి రైల్వే, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సన్నిహిత సమన్వయం అవసరమని నొక్కి చెప్పారు. ఇలాంటి నిర్మాణాత్మక సమావేశాలు తరచుగా జరగడం వల్ల సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని, తద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్ల డీఆర్‌ఎంలు తో పాటు పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

## నస్తురుపల్లిలో రైతు భరోసా నిధుల విడుదల

## అధికారులకు కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశం



**భూపాలపల్లి, ఏప్రిల్ 16 (మనసులో మాట):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 20న జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి మొదట మేడిగడ్డ, కాళేశ్వరాన్ని సందర్శిస్తారని.. అనంతరం కాటారం మండలం నస్తురుపల్లిలో రైతు భరోసా రెండో విడత నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొంటారని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమానికి పటిష్టమైన బందోబస్తు కల్పించాలని అధికారులకు సూచించారు. నస్తూర్ పల్లి బహిరంగ సభకు వచ్చే ప్రజలకు మంచినీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను కోరారు. సభా ప్రాంగణాన్ని పరిశుభ్రం చేయాలని డీపీఓకు.. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హెలిప్యాడ్, అప్రోచ్ రోడ్ల వద్ద బారికేడింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు తెలిపారు. అత్యవసర వైద్య సేవల కోసం వైద్య కేంద్రాలు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. కాళేశ్వర దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఈఓను ఆదేశించారు. ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ సీఎం పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఇసుక లారీలకు అనుమతి ఇవ్వొద్దని.. క్వారీలను మూసివేయాలని స్పష్టం చేశారు. విధుల్లో ఉండే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని కలెక్టరేట్ ఏఓకు సూచించారు. అంతకుముందు అధికారులు నస్తూరి పల్లిలో హెలిప్యాడ్ పనులను పరిశీలించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, డీఎస్పీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేత జావీద్‌కు పలు సంఘాల నివాళులు

## రోడ్డు ప్రమాదంలో మరణించిన సీనియర్ నాయకుడు

## కుటుంబ సభ్యులకు వివిధ సంఘాల పరామర్శ



**ఖమ్మం, ఏప్రిల్ 16 (మనసులో మాట):** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ జావీద్ భౌతిక కాయాన్ని పలు సంఘాల నాయకులు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. బుధవారం రెడ్ హిల్స్ ప్రాంతంలోని ఆయన నివాసం వద్ద ప్రజల సందర్శనార్థం భౌతిక కాయాన్ని ఉంచారు. జావీద్ అకాల మరణం పట్ల రాజకీయ వర్గాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. వీర నారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్రబాయి, జిల్లా ఉపాధ్యక్షురాలు బి. జ్యోతి నివాళులు అర్పించారు. గౌరవ సలహాదారులు పుష్ప రజక, జేఏసీ కన్వీనర్ బానోతు బద్రు నాయక్, వీరన్న నాయక్, ప్రకాష్, యాదవ్, శివలాల్ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# నిరుద్యోగ యువతకు 'పీఎం ఇంటర్న్‌షిప్' వరం

## నెలకు 9 వేల స్టైఫండ్.. 6 వేల గ్రాంట్

## ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని జీఎం సూచన

**మహబూబాబాద్, ఏప్రిల్ 16 (మనసులో మాట):** యువతకు వృత్తిపరమైన నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని (పీఎంఐఎస్) జిల్లాలో అర్హులైన యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ (జీఎం) ఎస్. శ్రీమన్నారాయణ రెడ్డి తెలిపారు. ఈ పథకం కింద సంవత్సరానికి 1.25 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం మూడో దశలో అభ్యర్థులకు ఇచ్చే స్టైఫండ్‌ను 9,000 రూపాయలకు పెంచినట్లు ఆయన తెలిపారు. అదనంగా వన్‌టైమ్ గ్రాంట్‌గా 6,000 రూపాయలు కూడా అందజేయబడుతుందని వివరించారు.

### అర్హతలు.. దరఖాస్తు విధానం

ఈ పథకానికి 21 నుండి 24 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులని.. కుటుంబ వార్షిక ఆదాయం 8 లక్షల రూపాయల లోపు ఉండాలని జీఎం తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తిచేసినవారు లేదా చివరి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్, ఐటీ, తయారీ వంటి 24 రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలు శిక్షణ అందిస్తున్నాయని.. ఇంటర్న్‌లకు స్టైఫండ్‌తో పాటు వ్యక్తిగత బీమా సౌకర్యం కూడా ఉంటుందన్నారు. అర్హులైన యువత ఈ నెల 28వ తేదీ లోగా అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జిల్లాలో ఈ పథకంపై అవగాహన పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు శ్రీమన్నారాయణ రెడ్డి వెల్లడించారు.

# డ్రైవర్ల ప్రాణ రక్షణే లక్ష్యం

**ఐజీ రమేష్ నాయుడు**

**వాహన చోదకులకు కంటి పరీక్షలు, సీపీఆర్ శిక్షణ**

**మహబూబాబాద్ జిల్లాలో అరైవ్ అలైవ్**



**మహబూబాబాద్, ఏప్రిల్ 16 (మనసులో మాట):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు, సీపీఆర్ శిక్షణ శిబిరం నిర్వహించారు. 'అరైవ్ అలైవ్ఉ2026' కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ శిబిరానికి రోడ్డు భద్రత ఐజీ రమేష్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 1000 మంది ఆటో, బస్సు, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు. కేసముద్రం సీఐ సత్యనారాయణ, తొర్రూరు సీఐ గణేష్ రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.

### ప్రాణదాతలుగా డ్రైవర్లు

వాహనం నడిపే సమయంలో నిర్లక్ష్యం వీడాలని, డ్రైవర్లే నిజమైన ప్రాణదాతలని ఐజీ రమేష్ నాయుడు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల విషయంలో తెలంగాణ దేశంలోనే 8వ స్థానంలో ఉండటం ఆందోళనకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, ఫోన్ వాడటం వంటి పొరపాట్లు ప్రాణాల మీదకు తెస్తాయని హెచ్చరించారు. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలను సామాజిక బాధ్యతగా పాటించాలని పిలుపునిచ్చారు. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని.. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి అని స్పష్టం చేశారు.

### గోల్డెన్ అవర్ ప్రాధాన్యత

ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ ప్రమాదం జరిగినప్పుడు మొదటి గంట చాలా కీలకమని, ఆ 'గోల్డెన్ అవర్'లో డ్రైవర్లు స్పందించే తీరు ఎందరో ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ సీపీఆర్ పై అవగాహన ఉండాలని సూచించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ రవి రాథోడ్, మోటార్ వాహన ఇన్ స్పెక్టర్ (ఎంవీఐ) సాయి చరణ్ రోడ్డు భద్రత, అత్యవసర వైద్య సేవలపై అవగాహన కల్పించారు. అనంతరం ఐజీ, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఎస్పీ కలిసి అర్హులైన డ్రైవర్లకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను వారు స్వయంగా పరిశీలించారు.



# ప్రకృతికి మేలు చేసే వర్మీ కంపోస్ట్ వాడండి

- రసాయనిక ఎరువులతో పెచ్చరిల్లుతున్న అనారోగ్యాలు
- భూసారాన్ని పెంచేందుకు సేంద్రియ ఎరువులే మార్గం
- సత్తుపల్లిలో విరివిగా వర్మీ కంపోస్ట్ తయారీ



**రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 16 (మనసులో మాట):** గతంలో ప్రతి రైతుకు పాడి పశువులు ఉండటంతో వ్యవసాయానికి కావాల్సిన ఎరువులను స్వయంగా తయారు చేసుకునేవారు. కానీ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అధిక దిగుబడుల కోసం ప్రస్తుతం రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం విపరీతంగా పెరిగింది. దీనివల్ల భూమి, నీరు కాలుష్యమవ్వడమే కాకుండా మనం తినే ఆహారంలో విష అవశేషాలు చేరి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ కాలుష్య కోరల నుంచి భూమిని కాపాడుకోవడానికి పశువుల పేడ, వ్యర్థ పదార్థాలతో తయారు చేసిన వర్మీ కంపోస్ట్ వాడకం ఎంతో అవసరమని రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం సత్తుపల్లి గ్రామానికి చెందిన తేరా లక్ష్మీ రామిరెడ్డి దంపతులు పేర్కొన్నారు.

### నాణ్యమైన ఎరువుతో అధిక ప్రయోజనం

మనీషా ఆర్గానిక్ ఓ పీ సీ ప్రైవేట్ లిమిటెడ్ వర్మీ కంపోస్టు మేనేజింగ్ డైరెక్టర్ తేరా రామ్ రెడ్డి మాట్లాడుతూ.. తాము ప్యూర్ పశువుల పేడతో వర్మీ కంపోస్ట్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ట్రైకోడర్మా విరిడి, మైకోరైజా, ఫాస్ఫరస్ శాల్యూబుల్ బ్యాక్టీరియా వంటి జీవ శిలీంధ్ర నాశినులను కలిపి రైతులకు అందిస్తున్నామన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి సరసమైన ధరలకే ఈ ఎరువును విక్రయిస్తున్నట్లు వెల్లడించారు.

### భూమిని రక్షించుకుందాం

వర్మీ కంపోస్ట్ వాడటం వల్ల భూమి గుల్లబారి నీటిని నిల్వ చేసుకునే శక్తి పెరుగుతుందని రామ్ రెడ్డి వివరించారు. ఇది కేవలం ఎరువుగానే కాకుండా మొక్కలకు బలాన్ని ఇస్తుందని, సెమీ సేంద్రియ వ్యవసాయంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. భూసారాన్ని కాపాడుకుంటూ భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వర్మీ కంపోస్ట్ కావాల్సిన రైతులు 9100797999, 9100919163 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.



# బంజారా కాలనీలో సీసీ రోడ్డు పనుల పరిశీలన

**అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి**

**ప్రజల సౌకర్యమే మా ప్రాధాన్యత**

**మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**

**ఎల్బీనగర్, ఏప్రిల్ 16 (మనసులో మాట):** హయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గురువారం బంజారా కాలనీలో పర్యటించారు. అక్కడ జరుగుతున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాలనీవాసులతో కలిసి దగ్గరుండి పరిశీలించారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన తెలిపారు.

### ప్రజల కష్టాలు తీర్చేలా అభివృద్ధి

బంజారా కాలనీ అభివృద్ధి తమ ప్రాధాన్యతల్లో ఒకటి అని నవజీవన్ రెడ్డి పేర్కొన్నారు. సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత కాలనీలో మురికి, దుమ్ము సమస్యలు తగ్గిపోతాయన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. పనులు నాణ్యతతో, నిర్ణీత సమయంలోగా పూర్తి అయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పంతు నాయక్, బాలు నాయక్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# జావీద్‌కు కన్నీటి వీడ్కోలు

**అంతిమయాత్రలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి**

**సంతాపం తెలిపిన రాహుల్ గాంధీ, మంత్రులు**



**ఖమ్మం, ఏప్రిల్ 16 (మనసులో మాట):** సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ జావీద్ అంత్యక్రియలు గురువారం సాయంత్రం ముగిశాయి. సూర్యాపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందడంతో ఖమ్మం జిల్లాలో విషాదం నెలకొంది. రెడ్ హిల్స్‌లోని నివాసానికి పార్థివ దేహాన్ని తీసుకురాగా పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలివచ్చి నివాళులర్పించారు. భట్టి విక్రమార్కకు అత్యంత సన్నిహితుడైన జావీద్ భౌతిక కాయాన్ని డిప్యూటీ సీఎం సందర్శించారు. అంతిమయాత్రలో స్వయంగా పాల్గొని తన సహచరుడికి తుది వీడ్కోలు పలికారు.

### ప్రముఖుల సంతాపం

జావీద్ మృతి పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంతాపాన్ని ప్రకటించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. మాజీ మంత్రులు సంభాని చంద్రశేఖర్, పువ్వాడ అజయ్ కుమార్ తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు సంతాపం వ్యక్తం చేశారు. రెడ్ హిల్స్‌లోని నివాసం నుంచి కాంగ్రెస్ కార్యాలయం వరకు అంతిమయాత్ర సాగింది. అక్కడ పార్టీ కార్యాలయంలో భౌతిక కాయాన్ని ఉంచిన అనంతరం ఖిల్లా ప్రాంతంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.